సాక్షి
వికారాబాద్
గురువారం । 6 । ఫిబ్రవరి । 2025



ట్రేడ్ లైసెన్సు తప్పనిసరి

ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారులు చేసే వారిపై చర్యలు తప్పవని పట్టణ మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి అన్నారు. 8లో ▸



కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సిరాజొద్దీన్ అన్నారు. 8లో ▸



భారంగా సాగు..!

రోజురోజుకూ ఎరువుల ధరలు పెరుగుతున్నాయి. రైతులు అష్టకష్టాలోర్చి మరీ సాగుచేస్తున్నారు. 9లో ▸

న్యూస్‌రీల్

8 నుంచి భూ సర్వే

తహసీల్దార్ కిషన్



దుద్యాల్: మండలంలోని లగచర్ల గ్రామంలో ఈ నెల 8నుంచి భూ సర్వే ప్రక్రియ చేపట్టనున్నట్లు తహసీల్దార్ కిషన్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. పారిశ్రామిక వాడ ఏర్పాటులో భాగంగా లగచర్ల, రోటిబండ తండా, పులిచర్లకుంట తండాల్లో 110 ఎకరాల అసైన్డ్ భూములు సేకరించనున్నట్లు తెలిపారు. లగచర్ల గ్రామ సర్వే నంబర్ 102లో 43 మంది రైతులకు సంబంధించిన 47.25 ఎకరాల భూమి, రోటిబండ తండా సర్వే నంబర్ 102లో 30 మంది రైతులకు చెందిన 22 ఎకరాల భూమి, పులిచర్లకుంట తండా సర్వే నంబర్లు 117, 120, 121లోని 20 మంది రైతులకు చెందిన 40.15 ఎకరాల భూమికి సర్వే చేసి హద్దులను గుర్తిస్తామన్నారు. రైతులు అందుబాటులో ఉండి సర్వే సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు

అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్

అనంతగిరి: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా చర్యలు చేపడతామని అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ తెలిపారు. బుధవారం నగరం నుంచి హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ పి.వి.గౌతం, చీఫ్ ఇంజనీర్ చైతన్య కుమార్ అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విధి విధానాలపై సూచనలు చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల కోసం 2,57,664 దరఖాస్తులు వచ్చాయని, 2,46,479 అర్జీల పరిశీలనకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. మండలానికి ఒక గ్రామం చొప్పున ఎంపిక చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, హౌసింగ్ సీడీ ఏ కృష్ణయ్య, డీఈ, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

రూ.10 కోట్లతో గ్రంథాలయ భవనాలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: జిల్లా మరో నాలుగు నూతన గ్రంథాలయ భవనాలను నిర్మించాలని జిల్లా గ్రంథాలయాల సంస్థ నిర్ణయించింది. బుధవారం బడంగ్‌పేట్ జిల్లా గ్రంథాలయ సంస్థలో నిర్వహించిన సర్వసభ్య, వార్షిక బడ్జెట్ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేసింది. అబ్దుల్లాపూర్‌మెట్, మొయినాబాద్, కడ్తాల్, గండిపేటలో రూ.10 కోట్ల అంచనా వ్యయంతో ఈ భవనాలను నిర్మించనున్నట్లు పేర్కొంది. పుస్తకాల కొనుగోలుకు రూ.50 లక్షలు, ఫర్నీచర్‌కు రూ.50 లక్షలు, గ్రంథాలయ వారోత్సవాలకు రూ.5 లక్షలు కేటాయించింది. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అదనపు అధికారి పూర్ణచందర్‌రావు, పౌర సంబంధాల శాఖ అధికారి పీసీ వెంకటేశం, వయోజన విద్య ప్రాజెక్ట్ ఆఫీసర్ అనిత, పంచాయతీ ఆఫీసర్ ఎం.సాధన, జిల్లా గ్రంథాలయాల సంస్థ కార్యదర్శి మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మక శక్తిని పెంపొందించుకోవాలి

ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు



హయత్‌నగర్: పెరుగుతున్న సాంకేతిక, వైజ్ఞానిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని విద్యార్థులు తమ సృజనాత్మక శక్తిని పెంపొందించుకోవాలని హయత్‌నగర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్ బాబు అన్నారు. కళాశాల విద్యాశాఖ ఆదేశానుసారం బుధవారం హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు సృజనాత్మకమైన ఆలోచనలతో కొత్త ఆవిష్కరణలు రూపొందించాలని.. ప్రజా సమస్యల పరిష్కారానికి మార్గాలు అన్వేషించేలా ఆవిష్కరణలుండాలని సూచించారు. ఫలితంగా ఆదాయం, పేరు ప్రఖ్యాతలు సంపాదించవచ్చన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులకు కావాల్సిన సమాచారం, సలహాలు, సూచనలు ఇస్తామని కోఆర్డినేటర్ యాదగిరి రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఇందిర, అకడమిక్ కోఆర్డినేటర్ నర్సింహ, ప్రోగ్రాం ఆఫీసర్ శారదాదేవి, నాగరాజు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ముందడుగు



ఇటీవల హకీంపేట రైతులతో చర్చలు జరుపుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు ప్రక్రియ వేగవంతం

- అసైన్డ్ భూముల సేకరణ దాదాపు పూర్తి
- పరిహారం పెంపుతో రైతుల ఆసక్తి
- పోలేపల్లి రైతులకు పరిహారం అందజేత
- వారం రోజుల్లో హకీంపేట రైతులకు..
- లగచర్లలోనూ 70 శాతం మంది అంగీకారం
- త్వరలో పట్టా భూముల రైతులతో చర్చలు

వికారాబాద్: సీఎం సొంత నియోజకవర్గం దుద్యాల్ మండలంలో ప్రభుత్వం ఏర్పాటు చేయ తలపెట్టిన మల్టీ పర్పస్ ఇండస్ట్రియల్ పార్కుకు ముందడుగు పడింది. అధికారుల ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. లగచర్ల, రోటిబండ తండా, పులిచర్లకుంట తండాల పరిధిలోని 1,358 ఎకరాల్లో పారిశ్రామికవాడ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందుకోసం ప్రధానంగా మూడు రకాల భూములు(పట్టా, అసైన్డ్, ప్రభుత్వ) సేకరించాల్సి ఉంది. 547 ఎకరాల అసైన్డ్ భూమి, 90 ఎకరాల ప్రభుత్వ భూమి, 721 ఎకరాల పట్టా భూములు అవసరం. మొత్తం 800 మంది రైతులు భూములు కోల్పోనున్నారు. ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు ద్వారా 15వేల మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయని ప్రభుత్వ పెద్దలు అంటున్నారు. లగచర్ల ఘటన నుంచి ఇప్పుడిప్పుడే సాధారణ పరిస్థితులు నెలకొంటుండంతో అధికారులు తిరిగి భూ సేకరణ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సారి ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఒకే సారి మొత్తం భూమిని సేకరించకుండా ముందుగా అసైన్డ్ భూమిని గ్రామాల వారీగా సేకరిస్తున్నారు. ఈ విషయంలో అధికారులు దాదాపు సక్సెస్ అయ్యారు.

ప్రస్తుత పరిహారం ఇలా..

ప్రస్తుతం ఎకరా అసైన్డ్ భూమికి రూ.20 లక్షలు చెల్లిస్తున్నారు. మహబూబ్‌నగర్ - చించోలి హైవేకు పక్కనే అభివృద్ధి చేసే డీటీసీపీ అప్రూవ్డ్ లేఅవుట్‌లో ఎకరాకు 150 గజాల ప్లాటు ఇవ్వనున్నారు. ఎకరా కంటే తక్కువ ఉన్నా.. ఐదారు గుంటల భూమిని కోల్పోయినా 75 గజాల ప్లాటు ఇవ్వనున్నారు. ఒక్కో ప్లాటు మార్కెట్ విలువ రూ.15లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయనున్నారు. అర్హతను బట్టి ఇంటికో ఉద్యోగం ఇవ్వనున్నట్టు అధికారులు చెప్పారు. అయితే పట్టా, అసైన్డ్ భూములకు కూడా ఒకే తరహా పరిహారం ఇస్తామని అధికారులు చెబుతుండగా ఇందుకు తాము అంగీకరించబోమని పట్టా భూముల రైతులు పేర్కొంటున్నారు.

గ్రామాల వారీగా భూ సేకరణ ఇలా..

దుద్యాల్ మండలం పోలేపల్లిలో 71.27 ఎకరాల అసైన్డ్ భూమి సేకరించారు. 38 మంది రైతులు భూములు కోల్పోనున్నారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్, అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ పలు సార్లు రైతులతో సమావేశమై వారిని ఒప్పించారు. పరిహారం కూడా అందజేశారు.

హకీంపేటలో..

ఈ గ్రామంలో 351.10 ఎకరాల అసైన్డ్ భూమిని సేకరించాలని అధికారులు గుర్తించారు. 218 మంది రైతులు భూములో కోల్పోనున్నారు. వీరితో కలెక్టర్ ఆధ్వర్యంలోని అధికారుల బృందం పలు మార్లు సమావేశమై చర్చించారు. దీంతో రైతులు భూములు ఇచ్చేందుకు అంగీకరించారు. వారం రోజుల్లో ఈ గ్రామ రైతులకు కూడా పరిహారం ఇవ్వనున్నారు.

లగచర్లలో..

లగచర్ల రెవెన్యూ గ్రామంలో 156.5 ఎకరాల అసైన్డ్ భూమి సేకరించాల్సి ఉంది. 93 మంది రైతులు భూములు కోల్పోనున్నారు. ఇక్కడి రైతులతో కూడా అధికాలు చర్చించారు. 70శాతం మంది భూములు ఇచ్చేందుకు అంగీకరించారు. మిగతా వారితో చర్చలు కొనసాగిస్తున్నారు. త్వరలో మిగిలిన వారు కూడా ఒప్పుకుంటారనే నమ్మకం ఉందని అధికారులు అంటున్నారు. ఈ ప్రక్రియ పూర్తికాగానే పట్టా భూముల రైతులను ఒప్పించాల్సి ఉంటుంది. అది కూడా పూర్తయితే ఇండస్ట్రియల్ పార్క్ ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోయినట్లే.

పరిహారం పెంచి ఇస్తున్న ప్రభుత్వం

2012 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలనే నిబంధన ఉన్నా ఇంకాస్త పెంచి ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. అదే విషయాన్ని అధికారులు రైతులకు తెలిపారు. ఆ ప్రాంతంలో భూమికి ప్రభుత్వ విలువ ఎంత ఉంటుందో దానికి మూడింతలు పరిహారం ఇవ్వాలని 2012 భూ సేకరణ చట్టం చెబుతోంది. దుద్యాల్ మండలంలో ఎకరా భూమికి ప్రభుత్వ విలువ రూ.2.25 లక్షలుగా ఉంది. ఈ లెక్కన ఎకరాకు రూ.6.75 లక్షల పరిహారం ఇవ్వాల్సి ఉంటుంది. బహిరంగ మార్కెట్‌లో ఎకరా భూమి రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు పలుకుతోంది. అయితే ఎకరాకు రూ.10 లక్షల పరిహారం, రూ.6 లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు, అర్హతను బట్టి ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం, ఎకరాకు 125 గజాల ప్లాటు ఇవ్వాలని గతంలో ప్రభుత్వం నిర్ణయించింది.



హాజరైన భూ బాధితులు

అసైన్డ్ భూముల సేకరణ దాదాపు పూర్తి

ఇండస్ట్రియల్ పార్కు కోసం మూడు రెవెన్యూ గ్రామాల పరిధిలో 547 ఎకరాలు అసైన్డ్ భూమి, 721 ఎకరాల పట్టా భూమిని సేకరించాల్సి ఉంది. ప్రస్తుతం అసైన్డ్ భూముల సేకరణ ప్రక్రియ దాదాపు కొలిక్కి వచ్చింది. ఇదే సమయంలో పట్టా భూములు తీసుకునేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇందుకోసం జిల్లా స్థాయి సంప్రదింపుల కమిటీ ఆధ్వర్యంలో రైతులతో చర్చలు జరుపుతున్నారు. కొంత మంది రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చారని అధికారులు తెలిపారు.

హామీలు అమలు చేయాల్సిందే



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పట్నం నరేందర్‌రెడ్డి

- 10న కోస్గిలో రైతు నిరసన దీక్ష
- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్: ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో నియోజకవర్గ స్థాయి నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్న కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే అర్హత లేదని విమర్శించారు. జనవరి 26న కోస్గి మండలం చంద్రవంచ గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి నాలుగు పథకాలను ప్రారంభించారని గుర్తు చేశారు. అదే రోజు అర్ధరాత్రి 12 గంటల నుంచి రైతుల ఖాతాల్లో టకీ టకీ మంటూ డబ్బులు పడతాయని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అంతలోనే మార్చి 31న రైతు భరోసా చెల్లిస్తామని మాట మార్చారని ఆరోపించారు. ఇచ్చిన హామీ మేరకు ఎకరానికి రూ.15వేలు చెల్లించాలన్నారు. సీఎం సొంత నియోజకవర్గంలో కూడా పూర్తి స్థాయిలో రుణమాఫీ కాలేదన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. రైతులకు జరుగుతున్న అన్యాయంపై ఈ నెల 10న కోస్గిలో రైతు నిరసన దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ వస్తారని చెప్పారు. ప్రజలు, రైతులు అధిక సంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, నాయకులు మధు యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, ముదిగండ్ల కృష్ణ, భీములు, యాదగిరి, ఎరన్‌పల్లి శ్రీనివాస్, మహిపాల్, మున్నూరు బిచ్చప్ప, మధుసూదన్ రెడ్డి, శేరి నారాయణరెడ్డి, నర్మద కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

రానున్న రోజులు మనవే

దౌల్తాబాద్: బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్యపడరాదని.. రానున్న రోజులు మనవేనని.. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుండేపల్లి, దౌల్తాబాద్ గ్రామాలకు చెందిన వారిని బుధవారం పరామర్శించారు. అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మహిపాల్‌రెడ్డి, రమేష్, భీంరెడ్డి, మల్కప్ప తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

టాస్క్ సీఈఓ రాఘవేందర్‌రెడ్డి



ఉద్యోగాలు సాధించిన యువతులతో రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యమని టాస్క్ సీఈఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని టాస్క్ కార్యాలయంలో ఫ్యాక్స్‌కాన్ కంపెనీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో వెల్దండ మండలానికి చెందిన 16 మంది మహిళలు ఉద్యోగం సాధించారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలో 3వేల మంది మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. జాబ్ రిక్రూమెంట్ డ్రైవ్‌ను నిరుదోగ్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మార్కెట్ కమిటీని అభివృద్ధి చేయాలి

షాబాద్: సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీని జిల్లాలోనే ఆదర్శ మార్కెట్ కమిటీగా అభివృద్ధి చేయాలని వ్యవసాయ మార్కెట్ రాష్ట్ర కమిటీ డైరెక్టర్ లక్ష్మీబాయి సూచించారు. బుధవారం నగరంలోని మార్కెటింగ్ కార్యాలయంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మీబాయి మాట్లాడుతూ.. జిల్లాలో అతిపెద్దదయిన సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని చైర్మన్ సురేందర్‌రెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి మహ్మద్ రియాజ్ తదితరులున్నారు.

ఇంటి స్థలం కోసమే హత్య



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీఐ నగేష్, ఎస్ఐ శంకర్


- సుపారీ ఇచ్చి మరిదిని చంపించిన వదిన
- మద్యం తాగుదామని తీసుకెళ్లి హతమార్చిన నిందితులు
- వదినతో పాటు మరో ముగ్గురికి రిమాండ్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

బషీరాబాద్: మండలంలోని నవల్గాలో మంగళవారం జరిగిన మాల శ్యామప్ప హత్య కేసును బషీరాబాద్ పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. హత్యలో ప్రమేయం ఉన్న నలుగురు నిందితులను బుధవారం అరెస్టు చేసి మీడియా ముందు హాజరు పరిచారు. ఇందుకు సంబంధించిన వివరాలను తాండూరు రూరల్ సీఐ నగేష్, ఎస్ఐ శంకర్‌తో కలిసి తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి వెల్లడించారు. నవల్గా గ్రామానికి చెందిన హతుడు మాల శ్యామప్పకు ఇంటి స్థలం విషయంలో వదిన మాల సుగుణమ్మతో కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. మరిదిని అంతమొందిస్తే అతని ఆస్తి తనకు దక్కుతుందని సుగుణమ్మ భావించింది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన మాల శివకుమార్, కొత్త విజయ్‌కాంత్, విశ్వనాథ్‌తో రూ.50 వేలకు హత్య చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ముందుగా రూ.10 వేలు అడ్వాన్స్ ఇచ్చింది. మాల శ్యామప్పకు శివకుమార్ వరుసకు తమ్ముడు.. కొత్త విజయ్‌కాంత్, విశ్వనాథ్ స్నేహితులు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం శివకుమార్, కొత్త విజయ్‌కాంత్, విశ్వనాథ్ ఈ నెల 3వ తేదీ సాయంత్రం మద్యం తాగుదామని శ్యామప్పను బైక్‌పై ఎక్కించుకొని నవల్గా గేటు సమీపంలోని రాథోడ్ మోహన్ పొలం వద్దకు తీసుకెళ్లారు. అక్కడ అందరూ కలిసి మద్యం తాగారు.. ఆ తర్వాత శ్యామప్ప తలపై బండరాళ్లతో మోది హత్య చేశారు. హత్యను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు రోడ్డు పక్కన పడేశారు. ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకున్న తాండూరు రూరల్ సీఐ నగేష్, ఎస్ఐ శంకర్, సిబ్బంది 24 గంటల్లో ఛేదించారని డీఎస్పీ తెలిపారు. నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.5వేల నగదు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని తాండూరు మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. మొదటి ముద్దాయి సుగుణమ్మను చర్లపల్లి జైలుకు, మిగతా ముగ్గురిని పరిగి సబ్‌జైల్‌కు తరలించారు. హత్య కేసును ఛేదించిన ఎస్ఐ శంకర్, ఏఎస్ఐ నారాయణ, క్రైమ్ కానిస్టేబుళ్లు దస్తప్ప, నర్సింలు, ముని, ప్రతాప్ సింగ్‌కు డీఎస్పీ నగదు రివార్డులు అందజేశారు.

దేవుళ్లపై ఒట్లు కాదు..

రైతులకు ఇచ్చిన మాటను నిలుపుకోవాలి

- సీఎం నోట మాటవస్తే శాసనం కావాలి
- జోక్స్ కారాదు
- ఇచ్చిన హామీల్లో అర శాతమే అమలు
- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



రైతులతో మాట్లాడుతున్న సబితారెడ్డి

నవాబుపేట: దేవుళ్ల మీద ఒట్లు వేయడం కాదు.. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేసి మాటమీద నిలబడాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి విమర్శించారు. బుధవారం నవాబుపేటలో నిర్వహించిన రైతు ధర్నాలో ఆమె పాల్గొన్నారు. రైతులు, మహిళలతో మాట్లాడారు. రుణమాఫీ అయ్యిందా..? అడ బిడ్డలకు రూ.2,500 వస్తున్నాయా..?, పింఛన్లు ఇచ్చారా, రైతు భరోసా సాయం అందిందా..? అని అడిగారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని పలువురు సబితా రెడ్డి దృష్టికి తెచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నోట ఏదైనా మాట వస్తే అది శాసనం కావాలని, జీవోల రూపంలో రావాలని.. జోకులు కారాదని హితవు పలికారు. ఆరు గ్యారంటీల్లో అర శాతమే అమలు చేశారని, మిగతావాటికి మంగళం పాడారని విమర్శించారు. కేవలం 25 శాతమే రైతు రుణమాఫీ అయ్యిందని.. ఈ విషయాన్ని రైతులే చెబుతున్నారని పేర్కొన్నారు. ప్రజలు నమ్మి ఓట్లు వేసిన పాపానికి వారిని ముప్పు తిప్పలు పెడుతున్నారని తెలిపారు. పంట పెట్టుబడి సాయం అందక అప్పులు చేస్తున్నారని అన్నారు. రుణమాఫీ విషయం దేవుడెరుగు.. బ్యాంకర్లు రైతుల ముక్కు పిండి వడ్డీ వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ పేదలు, రైతుల పక్షపాతి అని.. జనం కష్టాల్లో ఉంటే చూస్తూ ఊరుకునే వారు కాదన్నారు. ముఖ్యమంత్రి, ప్రభుత్వం మెడలు వంచి పేదలు, రైతులకు మేలు జరిగేలా చూస్తామన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చే దాకా ప్రభుత్వాన్ని నిద్ర పోనిచ్చేది లేదన్నారు. బీఆర్ఎస్ ఎప్పుడూ ప్రజల పక్షమే అన్నారు. వారి కోసమే తమ పోరాటమన్నారు. అంతకుముందు పార్టీ రాష్ట్ర నాయకులు కార్తీక్‌రెడ్డి, నాగేందర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఆనంద్ మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, నాయకులు శుభప్రదీప్‌పటేల్, విజయ్‌కుమార్, ఆంజనేయులు, భరత్‌రెడ్డి, దాస్‌గౌడ్, శాంతకుమార్, భీంరావ్, రాజు, మాణిక్ రెడ్డి, వెంకటయ్య తదిరతులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సభ్యురాలు భవాని



మాట్లాడుతున్న భవాని

షాద్‌నగర్‌రూరల్: ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సభ్యురాలు భవాని సూచించారు. బుధవారం గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భవాని మాట్లాడుతూ.. సమాజంలోని ప్రతీ ఒక్కరికి ఎయిడ్స్‌వ్యాధిపై అవగాహన ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు వ్యాధి బారిన పడకుండా విద్యార్థులు వారిని చైతన్యవంతం చేయాలని సూచించారు. వివాహేతర సంబంధాలకు దూరంగా ఉండాలని అన్నారు. ఒకే సిరంజిని ఎక్కువ మందికి ఉపయోగించడంతో హెచ్ఐవీ సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపకుండా వారిని చేరదీయాలని అన్నారు. సమాజాభివృద్ధిలో భాగంగా ప్రతి విద్యార్థి విద్యతో పాటుగా సామాజిక సేవా కార్యక్రమాలలో పాలుపంచుకోవాలని అన్నారు. ఆరోగ్య సమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలే, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సృజన, ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి అఫ్రోజా, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

8 నుంచి ఓంకారేశ్వర స్వామి ఉత్సవాలు



డీఎస్పీ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఓంకారేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు

కుల్కచర్ల: మండల కేంద్రంలో ఈ నెల 8వ తేదీ నుంచి శ్రీ ఓంకారేశ్వర స్వామి దేవస్థాన ధ్వజ స్తంభ, స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు బుధవారం డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ అన్వేష్ రెడ్డిలను కలిసి ఆహ్వానించారు. ఓంకారేశ్వర స్వామి ఉత్సవాలలో పాల్గొని ప్రశాంత పూర్వకంగా కొనసాగేలా సహకరించాలని కోరారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య


వెంకటేశ్ (ఫైల్)

మీర్‌పేట: ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, సీఐ నాగరాజు కథనం ప్రకారం.. మీర్‌పేట ఓల్డ్ విలేజ్‌కు చెందిన ముక్కెర్ల వెంకటేశ్(50) ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొంత కాలంగా ఆయన మద్యానికి బానిస కావడంతో కుటుంబ సభ్యులు పట్టించుకోవడం లేదు. దీంతో అతను నెల రోజులుగా మీర్‌పేట మంత్రాల చెరువు వద్దే ఒంటరిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం వెంకటేశ్ చెరువు కట్టపై ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతుడి భార్య వాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ

చేవెళ్ల: ఎస్సీ వర్గీకరణ వెంటనే చేపట్టి ఎస్సీ ఉపకులాలకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల నాయకులు డిమాండ్ చేశారు. చేవెళ్లలో ఈ నెల 7వ తేదీన నిర్వహించ తలపెట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మద్దతుగా మండల కేంద్రంలో బుధవారం ఎమ్మార్పీఎస్ నాయకులు డప్పుల దరువులతో ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొని డప్పు దరువు వేసి వర్గీకరణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అసెంబ్లీలో బిల్లు పెట్టిందని చెప్పారు. వర్గీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మండల కేంద్రంలో డప్పుల దరువుతో ర్యాలీ నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొని ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ చేపట్టిన అనంతరం ఈనెల 7వ తేదీన నిర్వహించాల్సిన లక్ష డప్పులు, వేల గొంతుల ప్రదర్శన సభ వాయిదా పడినట్లు సమాచారం వచ్చింది.

వాటర్ ప్యూరిఫైర్ల అందజేత


అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

అనంతగిరి: వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్, క్రెడిట్ యాక్సెస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం రెండు వాటర్ ప్యూరిఫైర్ సెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు శ్రీనివాస్‌బాబు, రమేష్, ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవనం పైనుంచి దూకి విద్యార్థి ఆత్మహత్య

- ప్రిన్సిపాల్ మందలించాడని మనస్తాపం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి


నీరజ్ (ఫైల్)


ఆందోళన చేపట్టిన విద్యార్థి సంఘాల నాయకులు

షాద్‌నగర్‌రూరల్: ప్రిన్సిపాల్ మందలించాడని మనస్తాపంతో ఓ విద్యార్థి పాఠశాల భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బుధవారం పట్టణంలో కలకలం రేపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. పట్టణంలోని సీఎస్‌కే వెంచర్‌లో నివాసం ఉంటున్న హరిభూషణ్ పటేల్, భాగ్య దంపతుల కుమారుడు నీరజ్(15) స్థానిక శాస్త్ర పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఉదయం స్కూల్‌కు వెళ్లిన నీరజ్ స్నేహితుడితో కలిసి క్లాస్‌రూం నుంచి కారిడార్‌కు వచ్చాడు. ఇది గమనించిన ప్రిన్సిపాల్ నరేందర్‌రాయ్ వారిని మందలించాడు. దీంతో సాయంత్రం 4గంటలకు సుమారు 20 ఫీట్ల ఎత్తులో ఉన్న స్కూల్ అంతస్తు పైనుంచి నీరజ్ కిందికి దూకాడు.

రక్తపు మడుగులో..

పాఠశాల భవనం పైనుంచి దూకిన నీరజ్ రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతుండగా.. పాఠశాల సిబ్బంది వెంటనే అతన్ని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ విషయాన్ని విద్యార్థి తల్లిదండ్రులకు తెలియజేయడంతో వారు వెంటనే చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు.

విద్యార్థి నేతల ఆందోళన

విద్యార్థి ఆత్మహత్య విషయం తెలుసుకున్న ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ యువసత్తా యూత్ నాయకులు పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. పాఠశాల ఫర్నిచర్, అద్దాలు, బోర్డులు ధ్వంసం చేశారు. న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పాఠశాల ఎదుట బైఠాయించారు. పట్టణ సీఐ విజయ్‌కుమార్ అక్కడకు చేరుకుని దర్యాప్తు చేపట్టారు. అయితే ఆందోళనకారులు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో ఏబీవీపీ నేతలు షాద్‌నగర్‌లో గురువారం పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేస్తున్నారు.

వార్షికోత్సవం మరుసటి రోజే విషాదం

హరిభూషణ్ పటేల్, భాగ్య దంపతులకు నీరజ్‌తో పాటు ఓ కూతురు ఉన్నారు. మంగళవారం హరిభూషణ్ దంపతుల పెళ్లి రోజు కావడంతో వారు కుటుంబ సభ్యులతో ఘనంగా వేడుక జరుపుకొన్నారు. మరుసటి రోజే కొడుకు మృతిచెందడంతో గుండెలు పగిలేలా రోదిస్తున్నారు. ఆర్మీ జవాన్‌గా పని చేసిన హరిభూషణ్ రిటైర్మెంట్ కాగా, ప్రస్తుతం బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్రయ్య


మాట్లాడుతున్న చంద్రయ్య

కొడంగల్ రూరల్: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బుస్స చంద్రయ్య ఆరోపించారు. బుధవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర బడ్జెట్ ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజానికానికి, వ్యవసాయ రంగానికి ఉపాధి హామీ పథకానికి నిధుల కొరత విధించిందన్నారు. బీమా రంగాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్రం చూస్తోందని, వ్యవసాయ రంగాన్ని బడ్జెట్‌లో పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. విద్య, వైద్యం, తాగునీరు, రోడ్లు తదితర రంగాలకు నిధుల్లో కోత విధించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు మైసప్ప, అనంతయ్య, మంగమ్మ, వెంకటమ్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి

పార్టీ మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సిరాజొద్దీన్


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సిరాజొద్దీన్

మోమిన్‌పేట: తమ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సిరాజొద్దీన్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని సుద్దోడ్కతండాలో రూ.5లక్షల ఎన్‌ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సూచన మేరకు రూ.4కోట్ల సీసీ రోడ్ల పనులు ప్రారంభమయ్యాయన్నారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ప్రజాపాలనలో భాగంగా ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పర్మయ్య, నాయకుడు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

చైన్‌స్నాచర్ అరెస్టు

వృద్ధురాలి మెడలో మంగళసూత్రం అపహరణ

ఇబ్రహీంపట్నం రూరల్: ఇంట్లో ఒంటరిగా నివసిస్తున్న వృద్ధురాలి మెడలో ఉన్న మంగళసూత్రం అపహరించిన నిందితుడిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాఘవేంద్రనగర్ కాలనీలో నివాసం ఉంటున్న పుల్లగుర్రం అనుసూయ(70), తన భర్తతో కలిసి ఒంటరిగా ఉంటున్నారు. ఈ విషయం గమనించిన ఓ వ్యక్తి ఈ నెల 3వ తేదీన ఉదయం ఇంట్లోకి చొరబడి వృద్ధురాలి మెడలో పుస్తెల తాడు తెంపుకొని పరారయ్యాడు. ఈ విషయాన్ని ఆమె ఫోన్ ద్వారా పోలీసులకు తెలిపింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని విచారించగా, అదే ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. సీసీ కెమెరాల ఆధారంగా 16 ఏళ్ల బాలుడు ఈ దోపిడీకి పాల్పడినట్లు గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద మూడు తులాల బంగారు పుస్తెలతాడు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

పార్టీ కార్యక్రమాలకు దూరందూరం

- చర్చనీయాంశంగా కాంగ్రెస్ యాలాల మండల అధ్యక్షుడి వైఖరి
- నర్సిరెడ్డి తీరును తప్పుపడుతున్న స్వపక్ష, విపక్షాలు

యాలాల: కాంగ్రెస్ మండల అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్న సంగెం నర్సిరెడ్డి కొన్ని రోజులుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. మండల అధ్యక్షుడి వ్యవహారం కాంగ్రెస్ నాయకుల మధ్య చర్చకు దారి తీస్తోంది. అధికార పార్టీ మండల అధ్యక్ష బాధ్యత వహిస్తున్న నాయకుడు పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలు వంటి విషయంలో క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి. నాయకుల మధ్య వారధిగా ఉండాలి. ఇవేవి యాలాల మండలంలో కనిపించడం లేదని చర్చ సాగుతోంది. రెండు రోజుల క్రితం మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి అన్ని పార్టీల మండల అధ్యక్షులతో అధికారులు సమాశం నిర్వహించారు. దీనికి కూడా ఆయన హాజరుకాలేదు. ఈ విషయాన్ని ప్రధాన ప్రతిపక్ష పార్టీ నేతలు తప్పుబట్టారు. వీటితో పాటు బీసీ రిజర్వేషన్ అమలు తీర్మానం విజయవంతం కావడంతో టీపీసీసీ బుధవారం మండల కేంద్రాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించాలని మండల పార్టీకి సూచించింది. ఈ కార్యక్రమానికి సైతం నర్సిరెడ్డి దూరంగా ఉన్నారు. దీంతో చేసేదేమీలేక కాంగ్రెస్ సీనియర్ నాయకులు తూతూ మంత్రంగా ముగించారు.

అసెంబ్లీ ఎన్నికల్లో అధిక మెజారిటీ..

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి 5వేల పైచిలుకు మెజార్టీని అందించి, ఆయన గెలుపులో యాలాల మండలం కీలకంగా వ్యవహరించింది. 30 ఏళ్ల వ్యవధిలో యాలాల మండలం నుంచి కాంగ్రెస్ అభ్యర్థులకు దక్కని మెజార్టీ ప్రస్తుత ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి దక్కింది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే స్వయంగా పలుమార్లు సభలు, సమావేశాల్లో సైతం వ్యక్తపరిచారు. కాగా బీసీ రిజర్వేషన్ అంశాన్ని క్షేత్రస్థాయిలోకి పూర్తిగా తీసుకెళ్లి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు నాంది పలికాలని అధిష్టానం భావిస్తుంటే, యాలాల మండలంలో పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది. ఎమ్మెల్యే పర్యటన ఉంటే కనిపించే నాయకులు, ప్రభుత్వ పథకాల అమలు, ఆయా కార్యక్రమాల విషయంలో అంటీముట్టనట్లు వ్యవహరించడం తగదని పేర్కొంటున్నారు. మండల పార్టీ అధ్యక్షుడిగా సాగుతున్న నర్సిరెడ్డి, ప్రస్తుతం తాండూరు ఏఎంసీ వైస్ చైర్మన్‌గా ఉన్నారు.

మద్యం తాగి.. చెరువులోకి దిగి

యువకుడి గల్లంతు

బొంరాస్‌పేట: మద్యం తాగి చెరువులోకి ఈతకెళ్లిన ఓ వ్యక్తి గల్లంతైన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుద్యాల మండలం కుదురుమళ్లకు చెందిన గంగప్పల్లి రాజు(30) ఈ నెల 3న హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి తన సమీప బంధువు ప్రసాద్‌తో కలిసి బైక్‌పై వస్తున్నారు. మార్గ మధ్యలో పరిగిలో ఇద్దరు మద్యం తాగారు. ఈ క్రమంలో బొంరాస్‌పేట చెరువులో దిగి ఈత కొడుతూ స్నానం చేసుకుందామని రాజు దిగాడు. ఎంత సేపటికీ తిరిగి రాకపోవడంతో ప్రసాద్ భయపడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రెండు రోజులుగా గజ ఈతగాళ్లతో చెరువులో గాలింపు చేస్తున్నా ఆచూకీ లభించలేదని ఎస్సై రవూఫ్ బుధవారం తెలిపారు.

చేవెళ్ల ఎస్ఐగా వనం శిరీష

చేవెళ్ల: సైబరాబాద్ పరిధిలో ఎస్ఐల బదిలీలలో భాగంగా మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ నుంచి చేవెళ్లకు వనం శిరీష బదిలీ అయ్యారు. బుధవారం సైబరాబాద్ పరిధిలోని పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలువురు ఎస్ఐల బదిలీలకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు వనం శిరీష చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. అయితే చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఇప్పటికే ఇద్దరు ఎస్ఐలు శ్రీకాంత్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి ఉండగా ఆదనంగా శిరీషను కేటాయించారు.

ట్రేడ్ లైసెన్సు తప్పనిసరి

మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి


లైసెన్సు రెన్యువల్ చేసుకోవాలని దుకాణదారుడికి అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది

తాండూరు టౌన్: ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారులు చేసే వారిపై చర్యలు తప్పవని పట్టణ మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని పలు వ్యాపార దుకాణాల యజమానులకు మున్సిపల్ సిబ్బంది ట్రేడింగ్ లైసెన్సు రెన్యువల్ చేసుకోవడం, లైసెన్సు తీసుకోని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ట్రేడ్ లైసెన్సు లేకుండా వ్యాపారాలు చేయడం చట్ట విరుద్ధమన్నారు. పట్టణంలో సుమారు 2వేలకు పైగా దుకాణాలు లైసెన్సుతో కొనసాగుతున్నాయని, వారంతా లైసెన్సును రెన్యువల్ చేసుకోవాలన్నారు. అలాగే నూతనంగా వ్యాపార దుకాణాలు తెరిచిన వారు వెంటనే లైసెన్సు కోసం మీసేవలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. లైసెన్సు లేకుండా దుకాణాలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొన్న ఆటో

నలుగురికి గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

యాలాల: ఆటో అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని రసూల్‌పూర్ హనుమాన్ ఆలయ సమీపంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్ఐ గిరి తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరు మండలం జినుగుర్తికి చెందిన దాసు తన ఆటోలో ముగ్గురు ప్రయాణికులతో లక్ష్మీనారాయణపూర్ నుంచి తాండూరు వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో రసూల్‌పూర్ సమీపంలోకి రాగానే ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కన స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో దాసుతో పాటు పాత తాండూరుకు చెందిన నజీర్, నసీమా, సత్యనారాయణలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వీరంతా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్టిజన్ కార్మికుడికి గాయాలు

తాండూరు రూరల్: విద్యుత్‌శాఖలో పని చేస్తున్న ఆర్టిజన్ కార్మికుడికి ప్రమాదవశాత్తు గాయాలయ్యాయి. ఈ సంఘటన పెద్దేముల్ మండల కేంద్రంలోని పెద్దేముల్ తండా వద్ద బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కోట్‌పల్లి మండలం రాంపూర్ గ్రామానికి చెందిన మహబూబ్ అలీ పెద్దేముల్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆర్టిజన్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. పెద్దేముల్ తండా వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. దీంతో తలతో పాటు కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. వెంటనే తాండూరు పట్టణంలోని జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ప్రమాదవశాత్తు పడ్డాడా లేదా షాక్ తగిలిందా తెలియరాలేదు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి

- మరొకరికి గాయాలు
- మోకిల వద్ద ఘటన, కేసు నమోదు


ఘటనా స్థలంలో గుమిగూడిన వాహనదారులు, స్థానికులు

శంకర్‌పల్లి: ఓ ప్రైవేటు పాఠశాల బస్సు.. బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఇంజనీరింగ్ విద్యార్థి అక్కడికక్కడే మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. మండల పరిధిలోని ఎన్‌సీడీ రాయల్ పెవిలియన్ వద్ద బుధవారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి మోకిల సీఐ వీరబాబు, స్థానికుల వివరాలు ఇలా ఉన్నాయి.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా విజయవాడ అర్బన్ మండల కేంద్రానికి చెందిన శ్రీహర్ష(19)కు దొంతన్‌పల్లిలోని ఇక్ఫాయ్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ సీటు వచ్చింది. దీంతో అతని తల్లి మోకిలతండాలో ఓ గదిని అద్దెకు తీసుకుని ఇక్కడే ఉంటూ కొడుకును చదివిస్తోంది. శ్రీహర్ష నిత్యం బైక్‌పై కాలేజీకి వెళ్లివస్తుంటాడు. ఇదిలా ఉండగా బుధవారం కళాశాల ముగిసిన తర్వాత ఉప్పల్‌కు చెందిన క్లాస్‌మేట్ హర్షనందన్(19)ను తీసుకుని ఫ్రెషప్ అయ్యేందుకు మోకిలతండాకు వచ్చారు. సుమారు గంటపాటు రూంలో గడిపిన అనంతరం హర్షనందన్‌ను కాలేజీ వద్ద వదిలిపెట్టేందుకు బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యారు. ఎన్‌సీడీ రాయల్ పెవిలియన్ సమీపంలో కొండకల్ వైపు అతివేగం, అజాగ్రత్తగా వెళ్తున్న ఏపీ మోడల్ పాఠశాల బస్సు వీరిని బలంగా ఢీ కొట్టింది. బైక్ నడుపుపుతున్న శ్రీహర్షకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందగా.. హర్షనందన్ పాక్షిక గాయాలతో బయటపడ్డాడు. అతన్ని శంకర్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మోకిల పోలీసులు శ్రీహర్ష మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

‘సాక్షి’కి సలామ్



విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు, సాక్షి ప్రతినిధులు

- ప్రభుత్వ పాఠశాలల్లో స్టడీ మెటీరియల్ పంపిణీపై సర్వత్రా హర్షం
- పదో తరగతి విద్యార్థులకు ఉపయుక్తంగా పరీక్ష పాఠ్య పుస్తకాలు
- కరన్‌కోట్, కందనెల్లి దుద్యాల్, హకీంపేట్, హస్నాబాద్ స్కూళ్లలో పంపిణీ

దుద్యాల్: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా వ్యవస్థలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇందుకు తగ్గట్టుగానే పరీక్షల కోసం విద్యార్థులు పక్కాగా సన్నద్ధమవుతున్నారు. ముఖ్యమైన ప్రశ్నజవాబులను గుర్తించి ప్రిపేర్ అవుతున్నారు. ఇందుకోసం స్టడీ మెటీరియల్, టెస్ట్ పేపర్ల వైపు మొగ్గు చూపుతున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు వార్షిక పరీక్షల్లో రాణించేలా సాక్షి దినపత్రిక ఆధ్వర్యంలో పదో తరగతి స్టూడెంట్లకు ఏటా స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇంగ్లిష్ మీడియం చదువుతున్న విద్యార్థులకు దోహదపడేలా పుస్తకాలను రూపొందిస్తున్నారు. సాక్షి మెటీరియల్ బాగుందని ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు, విద్యాధికారులు చెబుతున్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

దుద్యాల, హకీంపేట, హస్నాబాద్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు బుధవారం ఎంఈఓ విజయ రామారావు చేతుల మీదుగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సాక్షి సర్క్యులేషన్ మేనేజర్ మహేశ్, ఇన్‌చార్జ్ వెంకటేశ్, దుద్యాల సాక్షి రిపోర్టర్ ఎరుకల రమేశ్, టీపీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్ గౌడ్, న్యాయవాది శివకుమార్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చాలా బాగుంది



సాక్షి అందించిన గణితం, భౌతికశాస్త్రం స్టడీ మెటీరియల్‌లు చాలా బాగుంది. వార్షిక పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించేందుకు అనుకూలంగా ఉన్నాయి. ఒక యూనిట్ నుంచి ఎన్ని మార్కులు వస్తాయి అనే వివరాలతో బ్లూ ప్రింట్ ఉంది. దీంతో ఏయే ప్రశ్నలు చదవాలనే విషయం సులువుగా అర్థమవుతుంది. సాక్షి యాజమాన్యానికి ధన్యావాదములు.

– హరిక, పదో తరగతి, దుద్యాల్ పాఠశాల

సాక్షి కృషి అభినందనీయం



సాక్షి యాజమాన్యం అందిస్తున్న స్టడీ మెటీరియల్ విద్యార్థులకు చాలా ఉపయుక్తంగా ఉంది. నేను కూడా నిత్యం సాక్షి దినపత్రిక చదువుతా. విద్య, ఉద్యోగాలకు సంబంధించిన అనేక విషయాలు ఇందులో ఇస్తున్నారు. వాటిని కట్ చేసి జిరాక్స్‌లు తీసి విద్యార్థులకు అందజేస్తున్నాం. సాక్షి అందించిన దిక్సూచి ఎంతో మందిని విజయతీరాలకు చేర్చింది. పేద విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేస్తున్న సాక్షి కృషి అభినందనీయం.

– విజయరామారావు, ఎంఈఓ, దుద్యాల

ట్యాంకర్‌ను ఢీకొని వ్యక్తి దుర్మరణం


రాజునాయక్ (ఫైల్)

కేశంపేట: వాటర్ ట్యాంకర్‌ను ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన మండల పరిధిలోని వేములనర్వ గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పుట్టోనిగూడ గ్రామ పరిధిలోని కాంకిరాళ్లతండాకు చెందిన వాంక్డావత్ రాజునాయక్(38) బైక్‌పై తండా నుంచి ఉదయం వేములనర్వ గ్రామానికి పని నిమిత్తం వచ్చాడు. మధ్యాహ్నం తిరుగు ప్రయాణంలో గ్రామ శివారులోని కోమటి చెరువు అలుగు దగ్గర వాటర్ ట్యాంకర్ అజాగ్రత్తగా నిలపడంతో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రాజు తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ నరహరి తెలిపారు.

వ్యసనాల బారిన పడొద్దు

ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు


ర్యాలీలో ఏసీపీ రాజు, పోలీసు సిబ్బంది

యాచారం: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు సూచించారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆకులమైలారం గ్రామంలో బుధవారం సాయంత్రం పోలీసులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీసులతో కలిసి ఏసీపీ గ్రామంలోని పలు కాలనీల్లో కలియ తిరిగారు. ప్రధాన చౌరాస్తాల్లో ప్రజలతో మాట్లాడారు. గ్రామంలో సంచరించే కొత్త వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యార్థులు, యువత, మద్యం, డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిస కావొద్దన్నారు. వ్యసనాలకు గురై జీవితాలను నాశనం చేసుకోవద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ తేజంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మంచి ఉత్తీర్ణత సాధించాలి


కందనెల్లి పాఠశాల్లో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు, సాక్షి ప్రతినిధులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని కరన్‌కోట్, పెద్దేముల్ మండలం కందనెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో బుధవారం పదో తరగతి విద్యార్థులకు సాక్షి దిన పత్రిక(జగతి పబ్లికేషన్స్) ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్క్యులేషన్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మేనేజర్ శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలోని పేద విద్యార్థులకు సంస్థ తరపున స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కష్టపడి చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాండూరు సర్క్యులేషన్ ఎస్ఆర్ చేతన్‌కుమార్, సామాజిక కార్యకర్త మంబాపూర్ వెంకటయ్యలు ఉన్నారు.